క్లుప్తంగా

మండల విద్యాశాఖాధికారికి సన్మానం



పొన్నూరు: ఈనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేస్తున్న మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరెడ్డిని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్, మండల అధికారులు సోమవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓగా శ్రీనివాసరెడ్డి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం శాలువా, పుష్పగుచ్ఛం అందంచి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.చంద్రశేఖరరావు, ఏఓ.వెంకట్రామయ్య, సీడీపీఓ వెంకటరమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి బోనాలు



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామివారి 27వ వార్షిక మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ ఆదిశక్తి అంకమ్మతల్లికి బోనాలు సమర్పించారు. శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లికి కంకుమ, మల్లెపూలతో సహస్రనామావళి చేపట్టారు. సాయంత్రం వేద మంత్రోచ్చారణ నడుమ బలిహరణ శాస్త్రోక్తముగా నిర్వహించారు. రాత్రి శ్రీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు కార్యక్రమం భక్తజనుల సమక్షంలో కనుల పండువుగా సాగింది. వేద పండితులు దండిబొట్ల కృష్ణ శర్మ, మాధవశర్మల నేతృత్వంలో పూజలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. గ్రామస్తులు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

విద్యార్థినికి అభినందనలు



పొన్నూరు: నిడుబ్రోలు కొండమూది రోడ్డులోని మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తీర్ణత (569)సాధించి పాఠశాలలో మొదటి స్థానం సాధించిన విద్యార్థిని పాలపర్తి భార్గవిని బీఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి యాతాటి కిషోర్ అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో భార్గవి, ఆమె తల్లిని సన్మానించి ఆర్థిక సహాయం చేశారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్తసేకరణ నూరుశాతం జరగాలి



గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు పిన్ పాయింట్ ప్రోగ్రాం మేరకు ఇళ్ల నుంచి నూరుశాతం చెత్త సేకరణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం గోరంట్ల, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వారు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజారోగ్య విభాగ కార్మికులు తమకు కేటాయించిన ఇళ్ల నుంచి చెత్త సేకరణ చేయడం ద్వారా రోడ్లు, కాలనీలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



పెదకాకాని: క్రీడలకు అధిక ప్రాధాన్యత ఉందని ఇండియన్ ఆర్చరీ క్రీడాకారుడు కొండూరు వెంకటాద్రి అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు. క్రీడల్లో రాణించిన వారు చదువులో కూడా ముందజలో ఉంటారన్నారు. వీవీఐటీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు చదువులో భాగమన్నారు. క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిచారు. అంతర్ కళాశాల నందు నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్‌తో కలసి పురస్కారాలు, ప్రశంసా పత్రాలను అందించారు. అకడమిక్స్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ అరుణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కీలక పోస్టులు ఖాళీ.. కదలని దస్త్రాలు

- సెలవుల్లో సూపరింటెండెంట్.. కొరవడిన పర్యవేక్షణ
- రీ–సర్వే సమస్యలతో ప్రజలు ఇబ్బందులు
- అదనపు బాధ్యతలతో ఉద్యోగులు సతమతం



పొన్నూరు తహసీల్దార్ కార్యాలయం

పొన్నూరు: మండలంలో 29 గ్రామాలు, పట్టణంలో 31 వార్డులు ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యమున్న పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీగా ఉండడంతో పాలన గాడితప్పింది. ప్రజా సమస్యలు పరిష్కారం కాక దస్త్రాలు అటకెక్కుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. సిబ్బంది ఎప్పుడుంటారు.. ఎప్పుడు వెళతారో పట్టించుకునే వారు కరువయ్యారు. అదనపు బాధ్యతలతో పలువురు ఉద్యోగులు సతమతమవుతున్నారు. కార్యాలయంలో సమస్యలు జఠిలంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇదీ పొన్నూరు తాహసీల్దార్ కార్యాలయం పరిస్థితి.

నామమాత్రంగా సేవలు..

కార్యాలయంలో గత ఎన్నికలకు ముందు ఎలక్షన్ డీటీ, సివిల్ సప్‌లెయ్ డీటీ, డెప్యూటీ తహసీల్దార్(సూపరింటెండెంట్) ఉద్యోగుల సేవలు పూర్తిస్థాయిలో అందేవి. మండలంలో ప్రస్తుతం ఎలక్షన్ డీటీ, రీ–సర్వే డీటీ పోస్టులు ఖాళీగా ఉండగా.. పౌర సరఫరాల డీటీ సేవలు మూడు మండలాలకు ఉండటంతో అవికూడా నామమాత్రంగానే అందుతున్నాయి. ఇక కార్యాలయం సూపరింటెండెంట్(డీటీ) ఈనెల 1వ తేదీన పలు సమస్యలతో సెలవుపై వెళ్లారు. సహోద్యోగుల సహాయ నిరాకరణ.. రాజకీయ కారణాలు.. ఒత్తిడే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. రోజుల తరబడి సెలవుల్లో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తుండడంతో ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. తహసీల్దారు నీడనే ఉంటున్న చిరుద్యోగులే కార్యాలయానికి దిక్కయ్యారనే.. చిన్న సమస్యకు సైతం 'పెద్ద మొత్తం'లో వారిని ప్రసన్నం చేసుకోవాల్సిందేనన్న ఆరోపణలు న్నాయి.

> ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కూడా నామమాత్రంగానే సాగుతుంది. అర్జీలు స్వీకరించిన దాఖలాలు కనిపించడం లేదు. ప్రస్తుతం వల్లభరావుపాలెంలో జరుగుతున్న రీ–సర్వే నత్తనడకన సాగుతోంది. మండల వ్యాప్తంగా భూ సర్వే సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని రైతులు వాపోతున్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట..

తహసీల్దార్ కార్యాలయంలో కీలక అధికారులు, పలు విభాగాలు(డీటీలు) లేకపోవడంతో సకాలంలో అర్జీలు, భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. వల్లభరావుపాలెంలో జరుగుతున్న రీ–సర్వే ముందుకు సాగడంలేదు. వీఆర్‌ఓలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడి ఎక్కడ సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో భూ సమస్యలతో పాటు అనేక సమస్యలపై వచ్చే అర్జీలు అటకెక్కుతున్నాయి. వీఆర్‌ఓలు గ్రామాల్లో స్థానికంగా అందుబాటులో ఉండక.. ఫోన్‌లో కూడా స్పందించడంలేదని ప్రజలు వాపోతున్నారు. తమను పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకరికే మూడు బాధ్యతలు..

డీటీ(సూపరింటెండెంట్) స్థానాన్ని కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఆయన రూరల్ రెవిన్యూ ఇన్‌స్పెక్టరుతో పాటు రీ–సర్వే అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డీటీ స్థానంలో సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు అప్పగించినా.. శాఖాపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు, నిర్వహణకు అధికారాలు ఉండడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దారు కార్యాలయం పనితీరుపై దృష్టిసారించి మెరుగుపరచాల్సిన అవసరం చాలా ఉందని ప్రజలు కోరుతున్నారు.

మట్టి నమూనాలకు 14 రకాల పరీక్షలు



కార్యక్రమంలో ఏవో అరుణకుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది

ప్రత్తిపాడు: మట్టి నమూనాలకు 14 రకాల పరీక్షలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.అరుణ కుమారి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. ఏవో మాట్లాడుతూ.. గతేడాది సేకరించని సర్వే నంబర్ల నుంచి ఈ ఏడాది 830 మట్టి నమూనాలు సేకరించడం జరుగుతుందన్నారు. మే 15వ తేదీ వరకు నమూనాలు సేకరించి వాటిని ప్రయోగశాలకు పంపిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు స్వయంగా నమూనాలు తీసుకురావచ్చని.. లేదా వ్యవసాయ శాఖ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ప్రైవేటుకు ధీటుగా కోర్సులు

ప్రొఫెసర్లు తులసీదాసు, బ్రహ్మాజీ



మాట్లాడుతున్న ఆచార్య తులసీదాసు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రైవేటు విశ్వ విద్యాలయాలకు ధీటుగా వైవిధ్యమైన కోర్సులు అందిస్తోందని వర్సిటీ ప్రొఫెసర్ తులసీదాసు అన్నారు. సోమవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినులకు ఏఎన్‌యూ అందిస్తున్న పీజీ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎన్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీ మాట్లాడుతూ విద్యార్థుల అభిరుచి, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. విద్యా ప్రమాణాలను పాటించడంలో ప్రైవేటు వర్సిటీలకు ఆదర్శంగా నిలిస్తోందని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు విశిష్టమైన సేవలను అందిస్తూ అన్నింటా అగ్రగామిగా నిలుస్తోందని అన్నారు. విద్య, ఉపాధి అవకాశాల్లో ఏఎన్‌యూ సముచిత స్థానంలో ఉందని, అధ్యాపక బృందం విలువలతో కూడిన విద్య, ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తున్నారని వివరించారు. వర్సిటీ అందిస్తున్న కోర్సులు, విద్యా అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని కోర్సుల ఫీజులు ఉన్నాయని, సమాజ అవసరాలకు తగినట్లుగా వర్సిటీలో పలు వినూత్న కోర్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఆసక్తి మేరకు పలు డిప్లొమో. సర్టిఫికెట్ కోర్సులను అందిస్తోందని వివరించారు. విద్యార్థులకు మంచి సదుపాయాలు, ఆరోగ్యకర రీతిలో కూడిన వసతి గృహాలు, వ్యాయామ శాలలు, పుస్తక పఠన శాలలు ఆహ్లాదకర రీతిలో ఉన్నాయని చెప్పారు. డిగ్రీ అనంతరం విద్యార్థినులు వర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్జీరంగా వర్సిటీ డైమండ్ జూబ్లీ వేడుకలు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 60 వసంతాల వేడుకలను మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మిదేవి తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని లాం ఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరించి వీసీ మాట్లాడారు. రెండు రోజులపాటు జరిగే వేడుకల్లో 60 వసంతాల పైలాన్ ఆవిష్కరణ, ఆచార్య ఎన్జీరంగా విగ్రహావిష్కరణ, రైతు సదస్సులు, అధునాతన సాంకేతికతతో కూడిన వ్యవసాయ స్టాల్స్ తదితరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చం నాయుడు, ఇతర మంత్రులు, వ్యవసాయ శాఖాధికారులు, శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు రైతులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నామమాత్రంగా పరిష్కార వేదిక!



కార్యక్రమంలో తహసీల్దార్ జియా, పాల్గొన్న అధికారులు

పొన్నూరు: మండలంలోని చింతలపూడి గ్రామంలో తమ పొలానికి సర్వే చేయాలని కోరుతూ త్రిపురనేని వెంకటస్వామి అర్జీ దాఖలు చేశారు. గ్రామ స్థాయి సర్వేయర్ నుంచి మండల స్థాయి అధికారుల చుట్టూ తిరిగినా సమస్యకు పరిష్కారం లభించడం లేదని ఆయన వాపోయారు. ఇలా అనేక మంది ప్రజలు వివిధ సమస్యలతో తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నా పరిష్కారం లభించడం లేదని ఆవేదన చెందుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యల పరిష్కారం కోసం పట్టణంతో పాటు మండలంలోని 29 గ్రామాల నుంచి అనేక మంది అర్జీదారులు వచ్చారు. అర్జీ తీవ్రతను బట్టి సమస్యను నమోదు చేస్తున్నట్లు బాధితులు వాపోయారు. రాజకీయ కారణాలు, ఒత్తిడి ఉండే అర్జీలను పక్కన బెడుతున్నట్లు సమాచారం. ప్రధానంగా గ్రీవెన్స్‌లో భూ సమస్యలపై వచ్చే అర్జీలే ఎక్కువగా ఉంటాయి. వాటి ప్రభావాన్ని గ్రహించిన అధికారులు వాటిని లెక్కలోకి తీసుకోవడం లేదని సమాచారం. దీంతో 15 మందికి పైగా మండల అధికారులు పాల్గొన్న వేదికలో ఒకటి, రెండు అర్జీలు మాత్రమే రావడం గమనార్హం. స్థానికంగా సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజలు గుంటూరు కలెక్టరేట్ గ్రీవెన్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. గ్రీవెన్స్‌లో మండల అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కె.శ్రీనివాసరెడ్డి, ఏఓ డేగల వెంకట్రామయ్య, సీడీపీఓ వెంకట రమణ, ఏపీఎం.జోజిబాబు, మండల సర్వేయర్ సత్యనారాయణ, సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది శ్రీకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



శిక్షణకు హాజరైన విద్యార్థులు

ప్రత్తిపాడు: విద్యార్థులు క్రమశిక్షణను అలవరుచుకోవాలని మలినేని ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న పాలిటెక్నిక్ ఉచిత ఎంట్రన్స్ శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించగా పెరుమాళ్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామీణ విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో శిక్షణ ఇవ్వాలని 8 ఏళ్లుగా కళాశాల ప్రొఫెసర్లతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇక్కడ ఉచిత శిక్షణ పొందిన ఎందరో విద్యార్థులు పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌లో మంచి ర్యాంకులు, కళాశాలలో స్థానాలు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ఉచితంగా ట్రైనింగ్ ఇచ్చిన ప్రొఫెసర్లకు చైర్మన్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్, ఏబీవీ నేతలు

ఏఎన్‌యూ: సేవ్‌బర్డ్... సేవ్ ఎన్విరాన్‌మెంట్ అనే నినాదంతో స్టూడెంట్స్ ఫర్ డెవలప్మెంట్, ఏబీవీ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం విశ్వవిద్యాలయంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పక్షులు వేసవి కాలంలో నీరు, ఆహారం కోసం పక్షులు ఇబ్బంది పడకుండా తమ జీవనాన్ని సాగించే వీలు ఉంటుందన్నారు. విద్యార్థులతో కలిసి పక్షి మిత్ర అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజానికి, పర్యావరణానికి హాని కలిగించే ఒక్క సారి వినియోగించే ప్లాస్టిక్ బాటిల్స్‌ను సేకరించి వాటిని నీటి పరికరాలుగా తయారు చేసి వాటిలో నీరు, ఆహారం ఏర్పాటు చేసి, విశ్వవిద్యాలయంలోని చెట్లకు వాటిని అమర్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ఎఫ్‌డీ కో కన్వీనర్ శివ, రాష్ట్ర ఎస్‌హెచ్‌ఓ డీహెచ్ కన్వీనర్ రమాకాంత్, యూనివర్సిటీ అధ్యక్షులు చంద్రిక, యూనివర్సిటీ సెక్రటరీ వంశీ, యూనివర్సిటీ ఎస్ఎఫ్‌డీ కో కన్వీనర్ రాహుల్, యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు హేమంత్ రామ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత కల్పించాలి



నిరాహార దీక్షాలో మాట్లాడుతున్న ఎంఎస్.రెడ్డి

పొన్నూరు: ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్.ఎం.యు.ఎ జిల్లా కార్యదర్శి ఎంఎస్.రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎ.పి.పి.టి.డి, నేషనల్ మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం డిపో వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న ఎంఎస్.రెడ్డి మాట్లాడుతూ.. నిబంధనలు లేకుండా సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపాలని.. ఆగిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు జీఓ ప్రకారం పిల్లల సంరక్షణకు సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత విధానాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. 114 జీఓలో పొందుపరచిన నైట్ అవుట్ అలవెన్స్‌ను రూ.400 కు పెంచాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం, సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌ను వినియోగించుకోవాలి



గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణ

పెదకాకాని: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణ అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి కాలనీ గ్రంథాలయంలో సోమవారం సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తుళ్లూరు స్కూల్ హెచ్ఎం ఆదినారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ గ్రంథాలయాల్లో అమలు చేస్తున్న 40 రోజుల సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో మహానుభావులు, స్వాతంత్ర్య సమరయోధుల కథలు, జీవిత చరిత్రలు, వైజ్ఞానిక విశేషాలు, పత్రికలు చదివే అభిరుచిని పెంపొందించుకోవచ్చన్నారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూన్ 6వ తేదీ వరకూ కొనసాగుతుందని గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గోపాలరావు, ఉపాధ్యాయులు అనిల్, రాజా, జి.వెన్నెల తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన ఉరుసు వేడుకలు



దర్గాకి గుర్రంతో చేరుకుంటున్న ధర్మకర్త పఠాన్ మహబూబ్ సుభాని

పెదకాకాని: కరిముల్లా షా ఖాదరి నిషాని ఉరుసు గంధ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పెదకాకాని బాజీనగర్‌లోని కరిముల్లా షా ఖాదరి నిషాని వారి 16వ ఉరుసు గంధ మహోత్సవములో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఊరేగింపుగా బయలుదేరిన గంధం సోమవారం ఉదయం 11 గంటలకు కరిముల్లా షా ఖాదరి బాబా వారి నిషానికు చేరుకుంది. బాబా వారి సలామి ప్రార్థనలు, ఖురాన్ పఠనం అనంతరం నిర్వాహకులు భక్తులకు గంధం పంపిణీ చేశారు. భక్తులు దర్గా ప్రాంగణంలో దీపారాధనలు చేసి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. దర్గాకు విచ్చేసిన భక్తులందరికీ అన్నసంతర్పణ నిర్వహించారు.

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థికి అధిక వేతనంతో ఉద్యోగం



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఉన్నత విలువలతో కూడిన విద్యావిధానాల వల్ల తమ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు అన్నారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థి అభినందన కార్యక్రమంలో యాజమాన్యం మాట్లాడుతూ.. మీషో కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థి రూ.20 లక్షల ప్యాకేజీతో ఉద్యోగ అవకాశంతో పాటు, ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.లక్ష స్టైఫెండ్ అందజేస్తున్నట్లు సంస్థ తెలిపిందన్నారు. ఉద్యోగం సాధించిన విద్యార్థి నంబుల యోగేశ్వరరావుకు కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ ఏడాది 2024–25 విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు 810 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. ఉద్యోగం సాధించిన విద్యార్థినిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ జి.రామ్మోహన్‌బాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారులు సి.హెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

ఉద్యోగుల ప్రావిడెంట్‌పై అవగాహన సదస్సు

పెదకాకాని: సిబార్ దంత వైద్య కళాశాలలో ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ మినిస్ట్రీ ఆఫ్ లేబర్ వారి ఆధ్వర్యంలో సోమవారం నిధి అప్ కీ నికత్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రావిడెంట్ ఫండ్ గుంటూరు రీజనల్ ఆఫీసు నుంచి ఎన్ఫోర్స్ మెంట్ ఆఫీసర్ కె.నారాయణమూర్తి, సీనియర్ సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్ పి.వెంకటేశ్వరరావు, ఈఎస్ఐ అసిస్టెంట్ మేనేజర్ రమేశ్ విచ్చేసి పీఎఫ్, ఇ.డి.ఎల్.ఐ, పెన్షన్, ఈ–నామినేషన్, కేవైసీ, ఈఎస్ఐపై అన్ని విషయాలను కూలంకుషంగా సదస్సులో పాల్గొన్నవారికి తెలియజేశారు. ఈ కళాశాలలో పనిచేస్తున్న పీఎఫ్, ఈఎస్ఐ సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి రమణారెడ్డి, ఇతర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి బి.అరుణ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ.. రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం, గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, గేమ్స్ నేర్చుకోవాలని కోరారు.

వేసవి విజ్ఞాన శిబిరం

కాకుమాను: పుస్తక పఠనంతో జ్ఞానం కలుగుతుందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు నిర్వహించడంతో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందుతాయని ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రంథాలయ అధికారిణి పి.సుభాషిణి మాట్లాడుతూ.. జూన్ 6వ తేదీ వరకూ శిబిరం నిర్వహిస్తామని.. 40 రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, క్విజ్, డాన్స్, జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పిస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బోరుగడ్డ శాంసన్, సువార్త సుహాసిని, గారపాటి రమేష్, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.